● కొత్త రచయితలు మాత్రమే ఇన్లాండ్ కవర్‌మీద కథలు రాసి పంపాలి.

ఒక్క నిమిషం కథలు

## పాపం కండక్టర్

మా గ్రామం నుండి బస్ బయలుదేరింది. ఆ రోజు సమీపంలో ఉన్న పట్టణంలో సంత కావడంతో బస్ నిండా మా ఊరి ప్రజలే ఉన్నారు. బస్‌లో సీట్లు లేక పోవడంతో చివరి సీట్లో ఎలాగో సర్దుకూర్చున్నాను. పది నిమిషాల అనంతరం "టిక్కెట్ టిక్కెట్" అంటూ బస్ కండక్టర్ రావడంతో రామచంద్రాపురానికి టిక్కెట్ ఇవ్వమని మూడు రూపాయలిచ్చాను.

అతను టిక్కెట్ ఇచ్చి వెళ్ళిపోతుండగా "ఏవండీ టిక్కెట్ రెండున్నరే కదా. మిగిలిన అర్ధరూపాయి ఇవ్వరేం?" అన్నాను నేను. అతను వెంటనే చిరాకుగా మొఖం పెట్టి 'చిల్లర లేదు' అన్నాడు. 'ఎందుకు లేదు నా ప్రక్కనామెకివ్వడేగా చిల్లర ఇచ్చింది.?' ఈలోపు డ్రైవర్ బస్ ఆపాడు. బస్‌లో జనమంతా మా తగాదానే గమనిస్తున్నారు. ఏమిటి పెద్ద ఏభై రూపాయలు ఇవ్వాలన్నట్టుగా ఫీలౌతున్నావు. అర్ధరూపాయికే ఇదై పోతున్నావ్ అడుక్కునేవాడొస్తే రూపాయి వేస్తే కాని తీసుకు వెళ్లడం లేదు తెలుసా? అన్నాడు. కండక్టర్ "పోనీ అయితే ప్రభుత్వం వారు ఇచ్చే జీతం మీకు సరిపోవడంలేదేమొ. ఉద్యోగం మానుకుని మీరు అడుక్కోండి" అన్నాను నేను కోపంగా". మీరు ఇట్లా మాట్లాడితే బస్ దిగిపోవాల్సుంది. బస్‌మీ బాబుగారి సొత్తు కాదు. ముందు అర్ధరూపాయి ఇచ్చి కదలండి. తప్పనిసరి పరిస్థితుల్లో అర్ధరూపాయి ఇచ్చి సరాసరి డ్రైవర్ వద్దకు వెళ్ళిపోయాడు కండక్టర్. ఆ డ్రైవర్‌తో ఛీఛీ ఈ ఏపిఎస్‌ఆర్‌టిసిలో ఉద్యోగం చేసేకంటే అడుక్కోవడమే బెస్ట్. ప్రతీ పైసాకి ప్రతీ మనిషికి సమాధానం చెప్పాల్సి వస్తుంది. చూసారా ఆవిడెవరో అర్ధరూపాయి కోసం ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతుంది. ఇంత మంది ప్రయాణీకులున్నారు. మీరున్నారు. ఎవరైనా నాకు సపోర్ట్‌గా ఒక్క ముక్కైనా మాట్లాడారా?" అన్నాడు. బస్‌లో జనమంతా ఒక్కటే నవ్వులు. పాపం ఆ కొత్త కండక్టర్‌కేం తెలుసు ఆ బస్ డ్రైవర్ మా వారేనని.

—చిక్కాల మృదుల.



## పట్టుచీర

నాకు ఈరోజు ఎంతో ఆనందంగా వుంది అంటే ఒక నిధి దొరికినంత. నా చిన్ననాటి కోరిక ఇప్పుడు, ఇంతకాలానికి తీరినందుకు నిజంగా భగవంతునికి వందనములు అర్పించాను మనస్సులోనే. ఈ ముప్పై మూడేళ్ళ జీవితంలో ఇంత ఎక్సైట్‌మెంట్ అనుభవించిందీ ఈ రోజే. అదే మా అమ్మమ్మ జ్ఞాపకార్థమైన నాకు అత్యంత ఇష్టమై ఇన్ని సంవత్సరాలు నాకు దూరంగా వుండి నా మనస్సులో తీరని కోరికైన పట్టు చీర నాకు లభించడం. నాకప్పుడు 8 సం. వయస్సు వుంటుంది. మొదట పట్టుచీర చూపినప్పుడు నాకు జ్ఞాపకం రాకముందే మా అమ్మమ్మ చనిపోయింది. ఆవిడ పట్టుచీరలు అన్నీ మా పెద్దమ్మ వసమైనవి. మా అమ్మకి ఒక్క అక్క ఇద్దరన్నయ్యలు. మా అమ్మమ్మ చివరి తనంలో మా పెద్దమ్మ దగ్గరవుంది. ఆ సమయంలో ఆవిడ కనక, వస్తువులు చీరలు ఆవిడ పరమైనదని వినికిడి పెద్దల నానుడి. మా అమ్మ దాని గురించి బాధపడలేదు. అమ్మ గుర్తుగా ఒక్క చీర అయినా దక్కలేదు అని బాధపడేది.) నా ప్రాప్తం ఇంతే అనుకుని సరిపెట్టుకుంది. మా పెద్దమ్మ చీరలు వారికి ఇష్టమైన వారికి పంచి, ఒక్క చీర కోడలి కోసం దాచింది. ఆ చీర నాకు ఇంకా బాగా గుర్తు. పసుపు రంగుకి ఆకుపచ్చ బోర్డరు, ఏనుగుల డిజైను. ఎంత మెత్తగా వుందో. మా అమ్మమ్మ నాకు గుర్తులేని కారణంగా ఆ చీరను స్పృశించితే మా అమ్మమ్మ ప్రేమ, ఆదరణ, మంచితనం నాకు దొరికినట్లయి అయ్యేది. చిన్నతనంలో మా తాతగారి వూరు వెళ్ళినప్పుడు ఆ చీర చూపమని మారాము చేసేదాన్ని అడగ్గా, అడగ్గా ఆ చీర ఒక్కసారి మా పెద్దమ్మ చూపించేది కవర్ లోనించి తీయకుండా. అలాగా దాన్నిచూసి ఆనందించేదాన్ని. ఇన్ని సంవత్సరాలకి ఆ చీర నాదగ్గరకు వచ్చింది. ఇంతకంటె ఆనందం ఏముంది. దసరా సెలవులకి మా పిల్లలతో నేను అక్కవాళ్ళతో వరంగల్ వెళ్ళాను. ఆ చీర గురించి అడగటానికి, మొహమాటం. మళ్ళీ ఈ అవకాశం వస్తుందో రాదో అని భయం. ఆ చీరను చూడాలనే ఆత్రుత. అసలు వుందో లేదో, చిరిగిపోయిందో అని భయం. మా పెద్దమ్మ అక్కడ లేదు. వేరే వూరిలో వుంది. ఈ కారణంతో మొదటి రోజు అసిమితంగా గడిపాను. మరల రెండోరోజు రాత్రి ప్రయాణం. చివరికి ధైర్యం చేసి అడిగాను. మా పెద్దమ్మ కోడలికి ఇచ్చిందట. అది ఒక్కసారి కట్టుకోగానే చిరిగిందట. బీరువాలో భద్రంగా దాచారుట అని తెలిసింది. ఆ చీరను తీసుకొని దాన్ని నిమిరి ఆనందించాను. కొన్ని రోజులు నా దగ్గర వుంచుకొని మరమ పంపిస్తా అనే మాట తీసుకొని నా పెట్టెలో అపురూపంగా పెట్టాను. అన్నయ్య కొత్త చీర, పిల్లలకి బట్టలు పెట్టినా, అమ్మమ్మ చీరను తీసుకున్న ఆనందం పొందలేకపోయాను ఎందుకో. నిజంగా ఈ ప్రయాణం నా జీవితంలో మర్చిపోలేని సంఘటన. తీపిగుర్తు. మాటలలో చెప్పలేను ఒక మధుర అనుభూతి. ట్రైన్ కుదుపుకి ఇహలోకంలోనికి వచ్చాను. స్టేషన్ వచ్చింది. పిల్లలిని లేపి, అందరం కలిసి దిగాము. ఈ పట్టుచీర వెలుతురో అమ్మమ్మ చెయ్యి పట్టుకొని నడుస్తున్న అనుభూతితో పిల్లలతో బయటకు నడిచాను ఉత్సాహంగా.

—బి.డి.సుందరి